కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :159 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | ఆదివారం 11-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రత్యేక దృష్టి



హైదరాబాద్: సర్ ప్రక్రియపై కాంగ్రెస్‌తో పాటు, విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని టిబిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. అన్ని రకాల విచారణల తర్వాతే ఓటు తొలగిస్తారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 13 కోట్ల మంది ఓట్లు ఇంకా పూర్తిగా తొలగించలేదని, పెండింగ్ లో ఉన్న 13 కోట్లతో 2.89 కోట్ల ఓట్లు డూప్లికేషన్ అని..ఫాం-6 ద్వారా దరఖాస్తు చేసుకుంటే మళ్లీ ఓటు ఇస్తున్నారని రామచందర్ తెలియజేశారు. ఫారం-7 సమర్పించినంత మాత్రాన ఓటరు పేరు వెంటనే తొలగిపోదని, నిబంధనల ప్రకారం విచారణ అనంతరమే నిర్ణయం తీసుకుంటారని, సర్ ప్రక్రియలో అన్ని పార్టీలు బిఎల్ ఎలను నియమించుకున్నాయని రామచందర్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు వంటి రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసేలా విపక్షాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఓటర్ల పేర్ల తొలగింపుపై కాంగ్రెస్ ఇతర విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తూ, అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలగకూడదని డిమాండ్ చేస్తున్నాయని రామచందర్ రావు తెలిపారు.

ఢిల్లీలో పరిస్థితి ఎమర్జెన్సీ కంటే దారుణంగా ఉంది

న్యూఢిల్లీ, ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సీజేపీ చేపట్టనున్న ఆందోళన నేపథ్యంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరుపై ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు.'ప్రధాని మోదీ సంపూర్ణ నియంతృత్వ పాలనలో మనం జీవిస్తున్నాం. ఎమర్జెన్సీలో కూడా ఇంత దారుణంగా లేదు. ఇది ఎమర్జెన్సీని మించినది. రైళ్లను, మెట్రోలను, రోడ్డు మార్గాలను నిలిపివేశారు. కాగా.. విమానంలో సీజేపీ నేతలు వస్తే.. విమానం దిగడంతోనే వారిని అరెస్ట్ చేయడం నిజంగా భయాన్ని కలిగిస్తోంది. మోదీ ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా కాలరాస్తున్నారు. ప్రధాని మోదీకి తాను దొంగ ఓట్లతోనే ఎన్నికల్లో గెలిచానని స్పష్టంగా తెలుసు.. అందుకే ఈ ఉద్యమాన్ని అణచివేసి తన మోసం బయటపడకుండా కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు' అని కేజ్రీవాల్ తీవ్రంగా ఆరోపించారు.

ఢిల్లీలో అప్రకటిత ఎమర్జెన్సీ..కంగారెత్తిస్తున్న కాక్రోచ్‌లు

న్యూఢిల్లీ,దేశరాజధాని ఢిల్లీలో అప్రకటిత ఎమర్జెన్సీ నెలకొంది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాతోపాటు సర్ ప్రక్రియలో తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలనే డిమాండ్ తో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. శనివారం లోగా జ్ఞానేశ్ కుమార్ కుమార్ రాజీనామా చేయాలని సీజేపీ గతంలో హెచ్చరించింది. లేనిపక్షంలో జంతర్ మంతర్ 2.0 కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేసింది. సీజేపీ డిమాండ్ కు సీఈసీ జ్ఞానేష్ కుమార్ తలొగ్గకపోవడంతో శనివారం ఢిల్లీలో ఆందోళనలకు సీజేపీ కార్యకర్తలు సిద్ధమయ్యారు. అయితే గత జూలైలో సీజేపీ ఆందోళనల కారణంగా తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ సారి ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంది.

ఢిల్లీలో భారీ భద్రత

సీజేపీ ఆందోళనలను అడ్డుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. జంతర్ మంతర్ కు నాలుగు కిలోమీటర్ల పరిధిలో సాధారణ రాకపోకలకు కూడా అనుమతించడం లేదు. జంతర్ మంతర్ వైపు ఏ ఒక్కరూ వెళ్లకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. ఇదే సమయంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని నిరసనకారుల విషయంలో ఢిల్లీ పోలీసులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. బందోబస్తు ఏర్పాట్లను సీనియర్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నిరసనకారులు రెచ్చగొట్టినా నిగ్రహం పాటించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. పరిస్థితిని ప్రొఫెషనల్ గానే ఎదుర్కొవాలని స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా దాదాపు 34 వేల మంది పోలీసులను మోహరించగా, ఢిల్లీలో ఎక్కడిక్కడ అరెస్టులు కొనసాగుతున్నాయి. దాదాపు వంద మంది ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లతో రియల్ టైంలో నిరసనలు, పోలీసుల స్పందనను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

విమానంలోనే అభిజిత్ అరెస్టు

ఇక జంతర్ మంతర్ 2.0 ఆందోళనల్లో పాల్గొనేందుకు ఢిల్లీకి వచ్చిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేను విమానంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాము శాంతియుతంగానే ఉన్నామని, పోలీసులకు సహకరిస్తామని, విమానం దిగేవరకు వేచివుండాలని అభిజిత్ కోరుతున్నా, పోలీసులు మాత్రం పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. విమానంలో తనను అరెస్టు



చేసేందుకు పోలీసుల వచ్చిన విషయాన్ని అభిజిత్ స్వయంగా ఇన్ స్టా లైవ్ లో ప్రసారం చేశారు. అదే విమానంలో అభిజిత్ తోపాటు సీజేసీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు సీజేపీ న్యాయ సలహాదారు రత్నసింగ్, యూట్యూబర్ ధ్రువ్ రాఠీని కూడా పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు.

ఎక్కడాలేని ప్రచారం

ఇక కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనలకు ముందన్నెడూ లేనంత ప్రచారం వస్తోందని చెబుతున్నారు. సీఈసీ రాజీనామా డిమాండ్ తో నాలుగు రోజుల పాటు విపక్షం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇండి కూటమి పెద్ద ఎత్తున ఆందోళన చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ ధర్నాలు, ఆందోళనలు కన్నా సీజేపీ నిరసనలతోనే ప్రభుత్వం ఆందోళనలకు లోనవుతున్నట్లు తాజా పరిస్థితులు సూచిస్తున్నాయని అంటున్నారు. సీజేపీ కార్యకర్తలను అడ్డుకోడానికి ఢిల్లీ నగరంలో ఎప్పుడూ లేనంతగా భద్రతా ఏర్పాట్లను చేయడాన్ని ఎత్తిచూపుతున్నారు. సహజంగా దేశ రాజధాని ప్రాంతం కావడం, వీవీఐపీలు రాకపోకల కారణంగా ఢిల్లీ 24/7 నిఘా నీడలోనే ఉంటుంది. అదే సమయంలో ఆగస్టు 15, రిపబ్లిక్ డే వంటి జాతీయ పర్వదినాల్లో రెట్టింపు భద్రత ఏర్పాటు చేస్తారు. ఇక ఇప్పుడు ఆయా సమయాల్లో కన్నా అధికంగా భద్రతా బలగాలు మోహరించినట్లుగా వ్యాఖ్యానిస్తున్నారు. సీజేపీ పిలుపుతో యువత ఎక్కువగా ప్రభావితం కావడం, క్షణాల్లో దేశవ్యాప్తంగా వీడియోలు, ఫొటోలు వైరల్ కావడం వల్ల ప్రభుత్వం ఎక్కువ టెన్షన్ పడుతున్నట్లు విశ్లేషిస్తున్నారు.

మంత్రి పొంగులేటి సమావేశంలో పవర్ కట్

ఖమ్మం : ఖమ్మం జిల్లాలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో అనూహ్యంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో అభ్యర్థి సర్వోత్తమ ఆధ్వర్యంలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ క్రమంలో మంత్రి మాట్లాడుతుండగానే అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో సమావేశంలో కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘురాంరెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కీలక నేతలు హాజరైన సమావేశంలోనే విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో అక్కడి పరిస్థితి చర్చకు దారితీసింది.

రాజకీయంగా చర్చనీయాంశంగా మారిన విద్యుత్ అంతరాయం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రసంగిస్తున్న సమయంలోనే విద్యుత్ సరఫరా నిలిచిపోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా ఇలాంటి ముఖ్యమైన సమావేశాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా నిర్వాహకులు ముందస్తు ఏర్పాట్లు చేస్తుంటారు. అయినప్పటికీ, ఈ సమావేశంలో



పవర్ కట్ జరగడం నిర్వాహకుల ఏర్పాట్లపై ప్రశ్నలు తలెత్తేలా చేసింది. ఈ ఘటనపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. అయితే, విద్యుత్ అంతరాయానికి గల అసలు కారణం ఏమిటన్నది స్పష్టంగా తెలియాల్సి ఉంది. సాంకేతిక సమస్య కారణంగానే సరఫరా నిలిచిపోయిందా, లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే అంశాలపై అధికారిక వివరణ వెలువడితేనే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఎన్నికల సన్నాహక సమావేశంలో చోటుచేసుకున్న ఈ ఘటన ప్రస్తుతం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.

జీహెచ్ఎంసీ పరిధిలో ఐపీఎస్ అధికారుల ప్రక్షాళన!?



హైదరాబాద్,గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికలకు సమయం దగ్గరపడింది. దీంతో పార్టీలన్నీ ఈ ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ ఎన్నికలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో పోలీసు శాఖలో భారీ ప్రక్షాళన చేసేందుకు ఆలోచిస్తోంది. పరిపాలనా సౌలభ్యం, శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో ప్రభుత్వం ఐపీఎస్ అధికారుల బదిలీలకు ప్లాన్ చేస్తోంది. అయితే జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం భారీగా ఐపీఎస్ లను ప్రక్షాళన చేయబోతోందన్న టాక్ వినిపిస్తోంది.ప్రస్తుతం జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు ఐపీఎస్ అధికారులు ప్రజా ఫిర్యాదులను పరిష్కరించడంలో, విధులను నిర్వర్తించడంలో విఫలమయ్యారన్న నివేదికలు ప్రభుత్వానికి అందాయి. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన సివి ఆనంద్, జిల్లాల్లోని అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఉక్కుపాదం మోపుతున్నారు. అధికారుల పనితీరుపై నిఘా పెంచారు. ఈ నేపథ్యంలో సమర్థులైన అధికారులకు పెద్దపీట వేస్తూ, ఎన్నికల వేళ శాంతిభద్రతలను పటిష్టం చేసేందుకు వీలుగా ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. రాజకీయంగా అత్యంత కీలకమైన జీహెచ్ఎంసీ ఎన్నికలను అధికార పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ తక్కువ అంచనా వేయడం లేదు. నగరంలో పూర్తి పట్టు సాధించాలంటే పోలీసు యంత్రాంగం తమ కనుసన్నల్లో, అత్యంత సమర్థవంతంగా పనిచేయడం మంత్రులకి, పార్టీ అధిష్టానానికి అత్యంత కీలకం. అందుకే ఎన్నికలకు ముందే రాజకీయంగా సున్నితమైన ప్రాంతాల్లో తమకు అనుకూలమైన, సమర్థులైన అధికారులను మోహరించాలనే ఎత్తుగడ వేస్తోంది. ఇందులో భాగంగా ఐపీఎస్ ల బదిలీలపై కసరత్తు వేగవంతం చేసినట్లు తెలుస్తోంది.ఇదే సమయంలో.. 2001 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి అకున్ సభర్వాల్ ఏడేళ్ల కేంద్ర డిప్యూటేషన్ ముగించుకుని తిరిగి రాష్ట్రానికి వచ్చారు. డీజీపీకి రిపోర్ట్ చేశారు. ఇది రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. 2019లో టాలీవుడ్ డ్రగ్స్ కేసుకు సంబంధించిన సిట్ కు నాయకత్వం వహించి అప్పట్లో సంచలనం సృష్టించిన అకున్ సభర్వాల్‌కు ఇప్పుడు ఎలాంటి పోస్టింగ్ ఇస్తారనేది ఆసక్తికరంగా మారింది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ దాడుల నేపథ్యంలో 2018లో నమోదైన ఈ డ్రగ్స్ కేసులో పూరి జగన్నాథ్, ఛార్మి, రానా దగ్గుబాటి, రకుల్ ప్రీత్ సింగ్, నవ్‌దీప్, సుబ్బరాజు తదితరులను సిట్ బృందం విచారించింది. అయితే 2024 నాటికి తగిన ఆధారాలు లేకపోవడం తో కోర్టు నటులకు సం బంధించిన ఆరు కేసులను కొట్టేసింది.ఇప్పుడు ఇలాంటి వివాదాస్పద, హై-ప్రొఫైల్ కేసులను డీల్ చేసిన సమర్థుడైన అధికారి తిరిగి రాష్ట్రానికి రావడం, అదే సమయంలో జీహెచ్ఎంసీ ఎన్నికల హడావుడి మొదల వడం యాదృచ్ఛికం కాదనే గుసగుసలు

ఎర్రవల్లి భూముల ఎపిసోడ్‌లో బిగ్ ట్విస్ట్..

హైదరాబాద్, తెలంగాణ రాజకీయాల్లో ఎర్రవల్లి ఎపిసోడ్ హాట్‌టాపిక్‌గా మారింది. అక్కడ భూముల అంశంపై సెప్టెంబర్ 16న అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ విచారణకు ఆదేశించిన తర్వాత.. అధికారులు సర్వే చేపట్టారు. సెప్టెంబర్ 17న అధికారులు మొదటి దశ సర్వే నిర్వహించారు. అందులో సర్వే నంబర్ 325కు సంబంధించిన భూముల హద్దులను పరిశీలించారు. ఐతే రికార్డుల్లో ఉన్న 388 ఎకరాలకు బదులుగా 343 ఎకరాలు మాత్రమే గుర్తించినట్లు.. సీఎం నిర్వహించిన సమీక్షలో అధికారులు వివరించారు. దీంతో 45 ఎకరాల లెక్క ఎక్కడ తేడా పడిందన్నది అతిపెద్ద ప్రశ్నగా మారింది.అయితే, రెండో దశ సర్వే తర్వాత..ఈ కథలో అసలు ట్విస్ట్ కనిపించే చాన్స్ ఉంది. 45 ఎకరాల ఆచూకీ తేల్చేందుకు ఎర్రవల్లి, శివారు వెంకటాపురం పరిధిలో మరోసారి సర్వే నోటిఫికేషన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు సీఎం.. రికార్డుల్లో ఉన్న భూమి ఎక్కడుంది.. ప్రస్తుతం దాని పరిస్థితి ఏంటి.. హద్దులు ఎలా ఉన్నాయ్.. యాజమాన్య వివరాలు ఏంటనేది తేల్చే ప్రక్రియ ఇకపై మొదలుకానుంది. మరి ఈ సర్వేలో ఫాంహౌస్ పరిధి కూడా కీలకంగా మారుతుందా అనేది రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో 45ఎకరాల భూమి ఆచూకీ లభించడం లేదు. రికార్డులకు, వాస్తవానికి మధ్య ఈ వ్యత్యాసం ఉంది. దీనిపై విచారణ జరుగుతోంది. ఆ భూముల గుర్తింపునకు వెంటనే సర్వే నోటిఫికేషన్ విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. మరి ఈ పరిస్థితుల్లో కేసీఆర్ ఫ్యామిలీకి నోటీసుల చర్చ తెరమీదకు వచ్చింది. సర్వే నంబర్ 325కు ఆనుకుని కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల భూములు ఉన్నాయ్. దీంతో ఆయా భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు సమర్పించాలని వారికి నోటీసులు ఇవ్వాలని సీఎం ఆదేశించారు.అయితే, ఈ భూముల విషయంలో కేవలం సర్వేతోనే రేవంత్ సర్కార్ ఆగడం లేదు. సర్వే నంబర్ 325లో గుర్తించే ప్రభుత్వ భూమిని అర్హులైన స్థానిక రైతులకు పంపిణీ చేయాలని సీఎం ఆదేశించారు. అదే భూమిలో తెలంగాణ ఉద్యమ అమరవీరుల కుటుంబాల కోసం ప్రత్యేక అమరవీరుల కాలనీ నిర్మించాలని నిర్ణయించారు. అమరవీరుల కుటుంబాలకు ఇంటి స్థలాలు, మౌలిక వసతులు కల్పించి.. వచ్చే ఏడాది జూన్ 2 నాటికి కాలనీ నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. అంటే.. 45 ఎకరాల లెక్క తేలడం ఒక ఎత్తయితే.. ఆ భూమి భవిష్యత్తులో ఎవరికి వెళ్తుందన్నది మరో కీలక అంశంగా మారుతోంది.ఎర్రవల్లి భూములపై రేవంత్ సర్కార్ ఫోకస్ పెంచిన వేళ.. అటు బీఆర్ఎస్ కూడా రివర్స్ గేమ్ స్టార్ట్ చేసింది. సీఎం రేవంత్ కుటుంబ ఆస్తులు, వ్యాపార వ్యవహారాలపై ప్రశ్నలు కేటీఆర్, హరీశ్ రావు సహా బీఆర్ఎస్ నేతలు ప్రశ్నలు సంధిస్తున్నారు. మెడికవర్ సహా పలు సంస్థలు, వ్యాపార లావాదేవీలను ప్రస్తావిస్తూ సీఎం కుటుంబంపై కారు పార్టీ నేత క్రిశాంక్ కీలక ఆరోపణలు చేశారు. సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్



బయట 13వేల 200 కోట్ల పేరుతో ఫ్లెక్సీలు ప్రత్యక్షం కావడం.. ఆ తర్వాత క్రిశాంక్ అరెస్టో ఒక్కసారిగా రాజకీయ మంటలు కనిపించాయ్. ఇదే విషయాన్ని బీఆర్ఎస్ కూడా ముందుకు తీసుకెళ్తోంది. దీంతో పాలిటిక్స్ మరింత ఆసక్తికరంగా మారాయ్.అటు ఎర్రవల్లి ఎపిసోడ్.. ఇటు మెడికవర్ ముందు ఫ్లెక్సీలు. దీంతో రాజకీయం అంతా ఇప్పుడు భూములు, ఆస్తులు, కంపెనీలు, బిజినెస్ లింకుల చుట్టూ తిరుగుతోంది. ఎర్రవల్లి భూముల రికార్డులు తేల్చాలని రేవంత్ సర్కార్ అంటుంటే.. రేవంత్ కుటుంబ ఆస్తులు, వ్యాపారాలపై తమ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది.ఇక అటు బీఆర్ఎస్‌కు.. ఎర్రవల్లి ఎపిసోడ్ కీలకమైన రాజకీయ పరీక్షగానే మారింది. కేసీఆర్ కుటుంబానికి నోటీసులు వస్తే.. కారు పార్టీ రియాక్షన్ ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. వీటన్నింటికి మించి ఈ వ్యవహారంపై ఇప్పటివరకు రియాక్ట్ కాని కేసీఆర్.. నోటీసులు వచ్చిన తర్వాత స్వయంగా రంగంలోకి దిగుతారా.., తమ భూములకు సంబంధించిన రికార్డులను జనాల ముందు పెడతారా.. లేదంటే పార్టీ నేతలతోనే కౌంటర్ ఇప్పిస్తారా అనే చర్చ నడుస్తోంది. ఇక అటు రేవంత్ సర్కార్కు కూడా ఈ ఎపిసోడ్ అంత ఈజీ కాదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్. సర్కార్ చెప్పిన 45ఎకరాల తేడాకు పూర్తి ఆధారాలు చూపించడం.. సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం.. ఎవరి భూమి ఎక్కడుందనేది అధికారిక రికార్డులతో స్పష్టం చేయడం సర్కార్కు కీలకం కానుంది.అమరవీరుల కాలనీ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లాలంటే.. భూముల హక్కులు, హద్దులు, రికార్డులన్నీ క్లియర్గా ఉండాల్సిందే. అందుకే ఇప్పుడు రాజకీయ ఆరోపణల కంటే సర్వే రిపోర్ట్, రెవెన్యూ రికార్డులే కీలకంగా మారబోతున్నాయ్. ఓవరాల్గా తెలంగాణ రాజకీయాల్లో అసెట్స్ వార్ మరో స్టేజ్కు చేరుకున్నట్లు కనిపిస్తోంది. అయితే ఈ వ్యవహారాలకు కేంద్ర బిందువులుగా మారిన రేవంత్, కేసీఆర్ మాత్రం ఇప్పటివరకు ఆస్తుల అంశంలో నోరువిప్పకపోవడం విశేషం.

నవంబర్ 19న రెండు పథకాలు ప్రారంభం

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంలో రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం రెండు కీలక పథకాలను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. నవంబర్ 19న ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని సుమారు 1.1 కోట్ల రైతు కుటుంబాలకు భద్రత కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. రైతు కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా బీమా పరిహారం అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. అయితే, ఈ ఏడాది ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో ఆగస్టు 14 నుంచి ఇప్పటివరకు మరణించిన రైతుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం అందడంలో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పథకం ప్రారంభ తేదీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న పరిహారంపై కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని బాధిత కుటుంబాలు ఆశిస్తున్నాయి.

అదే రోజు రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభం

మరోవైపు, రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఆర్థికంగా అండగా నిలవడంతో



సంపాదకీయం

ఆదివారం 11-10-2026

ఈసీ పనితీరుకు గీటురాయి ప్రజావిశ్వాసమే

కచ్చితమైన ఓటర్ల జాబితా లేకపోతే ఏ ప్రజాస్వామ్యమూ ఉండదు. మరణించిన ఓటర్లను క్రమం తప్పకుండా జాబితా నుంచి తొలగించాలి. నకిలీ పేర్లను ఏరేయాలి. వలస వెళ్లినవారి తాజా వివరాలను పొందుపరచాలి. అనర్హులను తీసేయాలి. దీనిపై ఎలాంటి భిన్నాభిప్రాయాలు ఉండవు. అదే సమయంలో అర్హుడైన ప్రతి పౌరుడూ జాబితాలో ఉండాలి. తప్పుగా కొందరిని చేర్చడం లేదా మినహాయించడం ఓటర్ల జాబితా విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. ఈ సత్యాన్ని 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో అన్ని ఎన్నికల సంఘాలూ అర్థం చేసుకున్నాయి. ఓటర్ల జాబితా పవిత్రతను కాపాడటం రాజ్యాంగబద్ధమైన బాధ్యత. మొదటినుంచీ ప్రతి ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎలక్షన్ కమిషనర్ దీనికి అనుగుణంగానే పనిచేశారు. అందుకే సార్వత్రిక వయోజన ఓటుహక్కుకు మన్నన దక్కింది. అయితే, ఓటర్ల జాబితా ఎల్లప్పుడూ తప్పులు లేకుండా ఉంటుందనీ, దాదాపు వంద కోట్ల జనాభాతో కూడిన డేటాబేస్‌లో అసలు పొరపాట్లే జరగవని చెప్పలేం. అయితే, వాటిని ఎప్పటికప్పుడు సరిదిద్దుతుంటారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత 'సర్' కసరత్తు ప్రారంభమైనప్పటి నుంచీ నేను ఒకటే అడుగుతున్నాను... దశాబ్దాలుగా పనిచేస్తున్న వ్యవస్థను అకస్మాత్తుగా ఎందుకు పక్కన పడేయాల్సి వచ్చింది?ఓటర్ల జాబితాను కంప్యూటరీకరించిన తర్వాత నుంచి అప్పటికే ఉన్న లిస్టును పునాదిగా తీసుకుని కొత్త ఓటర్లను చేరుస్తున్నారు. మరణించినవారి పేర్లను, నకిలీ పేర్లను తొలగిస్తున్నారు. ఓటర్లు నివాసాలు మారినప్పుడు, ఆ మార్పులను నమోదు చేస్తున్నారు. అభ్యంతరాలను ఆహ్వానిస్తున్నారు. బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమాచారాన్ని ధ్రువీకరిస్తారు. ఈఆర్‌వోలు శాసనపరమైన నిర్ణయాలు తీసుకుంటారు. రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటాయి. ఇది సాధారణ ప్రక్రియ కాదు. తరతరాలుగా ఓటర్ల జాబితాను నిర్వహించిన వ్యవస్థ ఇది. అయితే జాబితాల సవరణకు ప్రత్యేకమైన కసరత్తు అవసరమయ్యే పరిస్థితులు కచ్చితంగా ఏర్పడవచ్చు. ఎన్నికల కమిషన్‌కు ఇటువంటి కసరత్తును చేపట్టే అధికారం ఉందని సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. కానీ చట్టబద్ధమైన అధికారం ఉండటమనేది చర్చకు ఆరంభం మాత్రమే, వ్యవహారం అక్కడితో ముగియదు. కొన్ని నెలల క్రితమే మార్పుచేర్పులు జరిగి, దాని ఆధారంగా ఎన్నికలు జరిగిన ఓటర్ల జాబితా ఏమైంది? ఆ జాబితా ద్వారా ప్రభుత్వాలను ఎన్నుకోగలిగినప్పుడు లక్షలాది మంది ఓటర్లు తమను తాము మళ్లీ నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది?

లోతుగా విచారించడం మంచిది

ఓటర్ల వలసలు, పట్టణీకరణ, బోగస్ ఓటర్ల నమోదు వల్లనే ఈ చర్య తీసుకోవాల్సి వచ్చిందని ఎన్నికల కమిషన్ చెబుతోంది. అలాగే భారత పౌరులు మాత్రమే ఓటర్లుగా నమోదు అయ్యేట్లు చూసుకోవడానికి కూడా 'సర్'ను చేపట్టామని వివరిస్తోంది. ఈ కారణాలేమీ కొత్తవేం కావు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ప్రజలు ఒక ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. సహజంగానే కొందరు పౌరులు మరణిస్తారు, ఇళ్లు మారతారు, ఏటా లక్షలాదిమందికి 18 సంవత్సరాలు నిండుతాయి. నకిలీలు తలెత్తుతారు. అటువంటి సమస్యలను నిరంతరం ఎదుర్కొని, పరిష్కరించడానికే ఎన్నికల యంత్రాంగాన్ని సృష్టించారు. ఎన్నికల అధికారులు 30, 40 లేదా 70 సంవత్సరాల్లో ఓపికగా సాధించినదాన్ని ఇప్పుడు అకస్మాత్తుగా మూడు నెలల్లో పునర్నిర్మించడం సాధ్యం కాదు. ప్రజాపాలనలో మంత్రదండాలేమీ ఉండవు. ఏదైనా ప్రాంతాల్లో అనుమానాస్పదంగా ఓటర్లు నమోదైనట్లు కనిపిస్తే, వాటిని లోతుగా విచారించాలి. సాంకేతికత బోగస్ ఓటర్లను సూచిస్తే, దాన్ని వెంటనే ధ్రువీకరించుకోవాలి. ఏదైనా అనుమానాస్పద చిరునామాలో వందలాది ఓటర్లు కనిపిస్తే, దాన్ని తనిఖీ చేయాలి. విదేశీ పౌరులు మన ఓటర్ల జాబితాలోకి చొరబడుతున్నారని ఆరోపణలు వస్తే, వాటిని విచారించాలి. నిజానిజాలేమిలో ఈఆర్‌వో ధ్రువీకరించాలి. నోటీసు జారీ చేయాలి. తప్పులు సరిదిద్దడానికి సక్రమ ప్రక్రియను అనుసరించాలి. కేవలం అనుమానం ఆధారంగా తీర్పు ఇవ్వరాదు.ఇక్కడ తెలంగాణ అనుభవాన్ని ప్రస్తావించాలి. నిజమైన ఓటర్లను తొలగించాలనే అభ్యర్థనతో ముందుగానే నింపిన ఫారం 7 దరఖాస్తులను పంపారనే కథనాలు వచ్చాయి. ఆవి రాష్ట్రవ్యాప్త పరిశీలనకు ఆదేశించేలా ప్రధాన ఎన్నికల అధికారిని ప్రేరేపించాయి. ఒక కేసులో నకిలీలుగా పేర్కొన్న మొత్తం ముప్పై మంది ఓటర్లు నిజమైన నివాసితులని తేలిన తర్వాత ఎఫ్ఐఆర్ దాఖలైంది. ఒక ఎంట్రీ తప్పంటూ పౌరుడు సంతకం చేసిన ప్రకటనే ఫారం 7. అంతే తప్ప ఇది సామూహికంగా ఓటు హక్కు తొలగింపునకు సాధనం కాదు. అనర్హుల పేర్లను తొలగించడానికి ఉద్దేశించిన వ్యవస్థ అర్హులను తొలగించడానికి జరిగే ప్రయత్నాలను గట్టిగా నిరోధించగలగాలి. ప్రతి అభ్యంతరాన్నీ పరిశీలించాలి. ఓటరుకు నోటీసు జారీ చేసి, విచారణ జరపాలి. ఓటర్ల జాబితాకు సంబంధించి తప్పుడు డిక్లరేషన్ ఇవ్వడం ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 31 ప్రకారం నేరం. ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దడానికి ఉద్దేశించిన యంత్రాంగం, ఆ జాబితాలలోని పేర్లను తొలగించే సాధనంగా మారకూడదు. బోగస్ ఓటర్లను తొలగించే పేరుతో అందరు ఓటర్లను బోనులో నిలబెట్టడం సరికాదు. 'సర్' గురించి నన్ను ఎక్కువగా కలవరపెట్టిన విషయం ఇదే.పౌరుడికి, ఎన్నికల ప్రాధికార సంస్థకూ మధ్య ఉండే సంబంధం తలకిందులైనట్లు కనిపిస్తోంది. ఒక వ్యక్తి పది ఇరవై ఏళ్లుగా ఓటరుగా నమోదు చేసుకుని ఉండవచ్చు, పదేపదే ఓటు వేసి ఉండవచ్చు, ఎన్నికల సంఘం స్వయంగా జారీ చేసిన ఓటరు ఫోటో గుర్తింపు కార్డునూ కలిగి ఉండవచ్చు. అయినా అతను పాత జాబితాతో తనను తాను మళ్లీ తనిఖీ చేసుకోవాలని ఆదేశించడం సరికాదు. ఉదాహరణకు 2008లో పద్దెనిమిదేళ్లు నిండిన యువకుణ్ణి తీసుకోండి. అతను 2009 నుంచి ప్రతి సాధారణ ఎన్నికలలో ఓటు వేశాడు. అతని పేరు 2003 జాబితాలో ఉండదు. అయినప్పటికీ అతను ఇప్పుడు ఓటర్ల జాబితాలోని తన తల్లిదండ్రుల వివరాల ద్వారా తనను తాను ధ్రువీకరించుకోవాల్సి వస్తుంది. అతని తల్లిదండ్రులు ఇప్పటికే మరణించి ఉన్నా, వారి పేర్లు తప్పుగా నమోదై ఉన్నా, లేదా వారి గ్రామంలోని పాత ఓటర్ల జాబితా దొరక్కపోయినా, తాను అసలైన ఓటరునని నిరూపించుకోవాల్సిన భారం అతనిపైనే పడుతుంది తప్ప తనను నమోదు చేసిన వ్యవస్థపై కాదు. ఏదిఏమైనా తాజా ఎన్నికలకు ముందున్న ఓటర్ల జాబితాకు కచ్చితంగా విలువ ఉండాలి.

ఏకాభిప్రాయంతోనే నిర్ణయాలు...

'సర్' పేరుతో 13కోట్లకు పైగా పేర్లను ముసాయిదా జాబితా నుంచే మినహాయించడం ఆందోళనకరం. ముసాయిదా జాబితా నుంచి ప్రతి తొలగింపూ అంతిమం కాదు. నిజమైన ఓటర్లు అప్పీళ్ల ద్వారా తిరిగి ఓటరు జాబితాలోకి రావచ్చు. కానీ ఈ స్థాయి మినహాయింపులను సాధారణ పొరపాట్లుగా పరిగణించలేము. సర్‌కి ముందు, తర్వాత జాబితాలను సరిపోల్చడానికి, అదృశ్యమైన అర్హులైన ఓటర్లను గుర్తించి వారిని తిరిగి జాబితాలోకి తీసుకురావడానికి ఎన్నికల సంఘం ఎలాంటి ప్రయత్నాలు చేసింది? ఈ ప్రక్రియ ఎంత పారదర్శకంగా ఉంది? ఎన్ని అభ్యంతరాలు వచ్చాయి? ఎన్ని పరిష్కరించారు? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. ఎన్నికల సంఘం ఎంత పారదర్శకంగా వ్యవహరిస్తే, ప్రజలు అంత ఎక్కువగా ఈ ప్రక్రియపై విశ్వాసం ఉంచుతారు

ఎన్నికలు వాయిదా సాధ్యమేనా

నెల్లూరు,ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ ఎన్నికలకు ముందే రాజకీయ వేడి రాజుకుంది. ఒకవైపు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం.. మరోవైపు అదే రిజర్వేషన్లను కోర్టులో సవాలు చేసిన పిటిషన్లు.. తాజాగా హైకోర్టు తీర్పు.. ఆ తర్వాత సుప్రీంకోర్టు మెట్లెక్కిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇదంతా కేవలం న్యాయపరమైన వివాదమేనా? లేక స్థానిక ఎన్నికల వెనుక పెద్ద రాజకీయ వ్యూహం నడుస్తోందా?ఆగస్టు 20, 2026న ఏపీ ప్రభుత్వం జారీ చేసిన ఉ.సా.ఓ.ఐ.ఐ.ఎ.ఐ.105 ద్వారా పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించింది. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం పరిమితిని దాటుతున్నాయంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. అక్టోబర్ 1న ఏపీ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. 34 శాతం బీసీ రిజర్వేషన్‌కు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా గరిష్ఠంగా ఆరు వారాల్లో ప్రారంభించాలని ఆదేశించింది.వైసీపీ వర్గాలు మాత్రం 34 శాతం బీసీ కోటా చట్టపరమైన పరిమితులను దాటుతుందని ముందే హెచ్చరించామని చెబుతున్నాయి. వైసీపీ అధికారిక వాదన ప్రకారం.. ప్రభుత్వం చట్టపరమైన సమస్యలు వస్తాయని తెలిసినా 34 శాతం కోటాను ప్రకటించి తర్వాత కోర్టు అడ్డంకిని రాజకీయంగా ఉపయోగించుకుంటోందని ఆరోపిస్తోంది. మరోవైపు కూటమి ప్రభుత్వం మాత్రం బీసీలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతోనే 34 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చామని చెబుతోంది.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికలను ఎదుర్కోవడానికి భయపడుతున్నారని, అందుకే బీసీ రిజర్వేషన్ల అంశాన్ని న్యాయపరమైన వివాదంగా మార్చి ఎన్నికలను ఆలస్యం చేయాలని చూస్తున్నారని కూటమి వర్గాలు ఆరోపిస్తున్నాయి.పంచాయతీ ఎన్నికలు జరిగితే గ్రామస్థాయిలో అధికార పార్టీ, ప్రతిపక్షాల బలాబలాలు స్పష్టంగా బయటపడతాయి. ఎవరి క్యాడర్ బలంగా ఉంది? ఎవరి నాయకత్వానికి గ్రామాల్లో ఆదరణ ఉంది? ఏ సామాజిక వర్గం ఎటువైపు నిలుస్తోంది? అన్నది ఎన్నికల ఫలితాలతో తేలిపోతుంది. అందుకే స్థానిక ఎన్నికలే ఇప్పుడు రెండు ప్రధాన పార్టీలకు రాజకీయ పరీక్షగా మారాయి.స్థానిక సంస్థలకు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో వివిధ గ్రాంట్లు, ఆర్థిక సంఘాల నిధులు, అభివృద్ధి నిధులు అందుతాయి. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2021–26 కాలానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ.10,231 కోట్ల కేటాయింపు ఉండగా రూ.10,055.82 కోట్లు విడుదలయ్యాయి. అయితే రూ.12,000 కోట్ల "పే కమిషన్ నిధులు" ఎన్నికలను ఆపడానికి జగన్ చేస్తున్న కుట్రలో భాగమే ఈ ఎన్నికలు అడ్డుకునే ప్రక్రియ అనే వాదన వినిపిస్తోంది.బీసీ రిజర్వేషన్లను వైసీపీ ఎందుకు అడ్డుకుంటోంది.? ప్రభుత్వం తీసుకొచ్చిన 34 శాతం కోటా చట్టపరమైన పరీక్షను ఎందుకు మోకాలడ్డుతోంది.? టీడీపీకి ఎన్నికల్లో ప్రయోజనం దక్కుండా చేసేందుకే ఈ కుట్ర చేస్తోంది.? ఎన్నికలు ఆలస్యం అయితే రాజకీయంగా వైసీపీకి లాభమా? గ్రామీణ స్థాయిలో బలాబలాలు బయటపడకుండా ఎన్నికల ప్రక్రియను సాగదీయడం వైసీపీ వ్యూహమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబోయే రోజుల్లో కోర్టు తీర్పులతో పాటు రాజకీయ పరిణామాలు కూడా ఇవ్వనున్నాయి.ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది. అక్టోబర్ 9న ఈ అంశంపై సుప్రీంకోర్టులో తదుపరి విచారణ జరగనుంది. కాబట్టి.. ఇది కేవలం 34 శాతం బీసీ రిజర్వేషన్ వివాదం కాదు. ఇది గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ఆధిపత్యం కోసం జరుగుతున్న మరో పెద్ద పోరాటం.ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి? బీసీలకు చివరకు ఎంత రిజర్వేషన్ దక్కుతుంది? కోర్టు నిర్ణయం ఎటువైపు ఉంటుంది? మరి ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయంగా లాభపడేది ఎవరు? సమాధానం కోసం రాబోయే పరిణామాలను గమనించాల్సిందే!

34 శాతం బీసీ వర్గాలకు సాధ్యమేనా

రాజమండ్రి,ఏపీ రాజకీయం మళ్లీ పాత పద్ధతిలోకే వెళ్లింది. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితి , క్రిష్ణమూర్తి కేసు తీర్పు ఆధారంగా రూపొందించిన ట్రిపుల్ టెస్ట్ విధానాన్ని అధిగమించడం అంత తేలిక కాదు అని తెలిసినప్పటికీ, ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా 34% లేదా అంతకంటే ఎక్కువ రిజర్వేషన్ల ప్రతిపాదనతో జీవోలు తీసుకువచ్చింది. చట్టపరంగా నిలబడదని అందరికీ తెలుసు. హైకోర్టులో ఇటువంటి నిర్ణయాలు సమీక్షకు వచ్చినప్పుడు 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టం కావడం దీనికి ప్రధాన నిదర్శనం. దీనివల్ల రిజర్వేషన్ల అంశం న్యాయస్థానాల్లో చిక్కుకోవడం, చివరికి పాత పద్ధతిలోనే ఎన్నికలు జరగడం లేదా ఆలస్యం కావడం పరిపాటిగా మారింది.అయితే, సాధ్యం కాదని తెలిసినా రాజకీయ పార్టీలు ఈ తప్పును పదే పదే ఎందుకు చేస్తాయి? అనేదే అసలు ప్రశ్న. దీని వెనుక ప్రధాన కారణం రాజకీయ క్రెడిట్ దక్కించుకోవడం , నెపం ప్రత్యర్థులపైకి నెట్టేయడం . 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభా సింహభాగాన్ని ఆకట్టుకోవడానికి ప్రతీ అధికార పార్టీ తాము బీసీలకు గరిష్ట స్థాయిలో స్థానిక పదవులు ఇస్తున్నామనే భావనను కల్పించడానికి ప్రయత్నిస్తుంది. ఆ తర్వాత కోర్టులు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తే, మేము ఇవ్వడానికి సిద్ధపడ్డాము కానీ కో ప్రత్యర్థి పార్టీలు వేసిన పిటిషన్ల వల్ల రద్దయ్యాయి అంటూ తమ తప్పును దాచుకునేందుకు , ప్రత్యర్థులను బీసీ వ్యతిరేకులు గా చిత్రీకరించేందుకు ఈ డ్రామా ఉపయోగపడుతుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలోనూ సరిగ్గా ఇదే తరహా పరిణామాలు చోటుచేసుకున్నాయి. 34% రిజర్వేషన్ జీవోలు తేవడం, అది కోర్టుల్లో రద్దు కావడం, ఆపై 24% కు తగ్గించి ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కూడా అదే తరహా నిర్ణయాలతో ముందుకు వెళ్తోంది. ఇక తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విషయంలోనూ కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు హామీల చుట్టూ ఇవే న్యాయపరమైన సవాళ్లు దాగి ఉన్నాయి. చట్టపరమైన వెసులుబాటు , సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసన తీర్పుల పరిమితిపై స్పష్టత ఉన్నప్పటికీ ఏ పార్టీ కూడా నిజం చెప్పే సాహసం చేయడం లేదు. ఒకవేళ పొలిటికల్ పార్టీలకు బీసీలకు న్యాయం చేయాలనే నిజమైన కట్టుబడి ఉంటే, చట్టపరమైన రిజర్వేషన్ల శాతం కోసం కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేయడం కంటే పార్టీ బి–ఫామ్‌ల కేటాయింపులో తమ నిజాయితీని నిరూపించుకోవచ్చు. మునిసిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు లేదా కార్పొరేషన్ ఎన్నికల్లో చట్టబద్ధంగా వచ్చే రిజర్వేషన్ శాతానికి అదనంగా, పార్టీల తరఫున జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులకే టికెట్లు ఇచ్చి గెలిపించే వెసులుబాటు రాజకీయ పార్టీలకు ఉంది. కానీ ఏ పార్టీ కూడా జనరల్ స్థానాలను బీసీలకు ఇచ్చేందుకు సిద్ధపడదు. కేవలం రాజ్యాంగ పరిమితులకు లోబడి ఉండే ప్రభుత్వ రిజర్వేషన్ల పేరు చెప్పి కాలం వెళ్లదీస్తాయి. ఏ ప్రభుత్వం వచ్చినా ఈ రిజర్వేషన్ల కంటితుడుపు చర్యలు కేవలం ఎన్నికల నాటికి ఓటర్లను మభ్యపెట్టడానికే తప్ప క్షేత్రస్థాయిలో బీసీలకు దక్కే నికర ప్రయోజనం శూన్యమని నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు.కోర్టు తీర్పుల సాకుతో పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లడం, పొలిటికల్ మైలేజ్ మాత్రం పొందే ప్రయత్నం చేయడం పరిపాటిగా మారింది.చట్టం పరిధి తెలిసీ ప్రజలను ఆశల్లో ముంచెత్తడం, ఆ తర్వాత న్యాయస్థానాల వైపు వేలు చూపించడం అనేది ఏపీ . ఇతర రాష్ట్రాల రాజకీయాల్లో ఒక ఫార్ములాగా మారిపోయింది. రాజకీయ పార్టీలు ఈ డ్రామాలను పక్కనపెట్టి, నిజాయితీగా పార్టీ టికెట్ల పంపిణీలో బీసీలకు

మగపిల్లల్ని వదలట్లేదు....



హైదరాబాద్, తెలంగాణలో బాలురపై లైంగిక వేధింపుల కేసులు తీవ్ర ఆందోళన కలిగించే స్థాయిలో వెలుగులోకి వస్తున్నాయి. 2026 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 62 మంది బాలురు పోక్సో కేసుల్లో బాధితులుగా నమోదైనట్లు లెక్కల ద్వారా తెలుస్తోంది. గతేడాది నమోదైన 61 కేసులను కేవలం 9 నెలల్లోనే ఈ సంఖ్య దాటినట్లు సమాచారం. తెలంగాణ పోలీసుల మహిళా భద్రతా విభాగం వెల్లడించిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన పోక్సో చట్టం కింద 2024 నుంచి 2026 సెప్టెంబర్ వరకు తెలంగాణలో మొత్తం 127 మంది బాలురు బాధితులుగా నమోదైనట్లు వెల్లడైంది. 2024లో కేవలం నలుగురు బాలురే బాధితులుగా నమోదవగా.. 2025లో ఆ సంఖ్య ఒక్కసారిగా 61కి పెరిగింది. 2026లో సెప్టెంబర్ నాటికే మరో 62 మంది బాలుర కేసులు నమోదయ్యాయి.అయితే కేసుల సంఖ్య పెరగడాన్ని లైంగిక దాడులు అదే స్థాయిలో పెరిగినట్లు నేరుగా అర్థం చేసుకోకూడదని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి ఘటనల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడం, బాధితులను గుర్తించడం, బాధిత కుటుంబాలు పోలీసులను ఆశ్రయించడం వంటి కారణాలతో గతంలో వెలుగులోకి రాని ఘటనలు ఇప్పుడు రికార్డుల్లోకి వస్తుండొచ్చని వివరిస్తున్నారు. 2025లో నమోదైన 61 మంది బాల బాధితుల్లో హైదరాబాద్‌లోనే 24 మంది ఉన్నారు. ఖమ్మంలో 13 కేసులు నమోదు అయ్యాయి. 2026 తొలి 9 నెలల్లో మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 9 మంది బాలురు బాధితులుగా నమోదయ్యారు.మిర్‌చౌక్, శంషాబాద్, మేడ్చల్–మల్కాజ్‌గిరి ప్రాంతాల్లో ఏడుగురు చొప్పున బాధితులు నమోదైనట్లు తెలంగాణ పోలీసుల మహిళా భద్రతా విభాగం వెల్లడించింది. గచ్చిబౌలి, హైదరాబాద్, కరీంనగర్, నిర్మల్, వరంగల్ ప్రాంతాల్లో మూడేసి కేసులు నమోదైనట్లు పేర్కొంది. బాలురపై లైంగిక వేధింపులు జరిగినప్పటికీ అనేక సందర్భాల్లో అవి బయటకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. కుటుంబం పరువు పోతుందని.. ఇలాంటి ఘటనలు బయటికి చెబితే సమాజం ఏమనుకుంటుందనే భయం.. అవమానాలు వంటి కారణాలతో కొందరు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారని పేర్కొంటున్నారు.మరోవైపు.. తమకు ఎదురైన భయానక అనుభవాన్ని తమ తల్లిదండ్రులకు కూడా చెప్పేందుకు పలువురు బాలురు భయపడే పరిస్థితులు ఉంటాయని చెబుతున్నారు. ముఖ్యంగా నిందితుడు తమకు తెలిసిన వ్యక్తి అయినప్పుడు బాలుడు విషయాన్ని చెప్పడానికి మరింత ఇబ్బంది పడే అవకాశం ఉందని పోలీస్ అధికారులు చెబుతున్నారు. తాజాగా నమోదైన రెండు కేసుల్లోనూ బాధిత పిల్లలు తల్లిదండ్రులకు విషయం చెప్పడంతోనే ఘటనలు వెలుగులోకి వచ్చాయి.చందానగర్‌కు చెందిన 4 ఏళ్ల బాలుడిపై అతను చదువుతున్న పాఠశాలలో పనిచేసే సెక్యూరిటీ గార్డు లైంగిక దాడికి పాల్పడిన ఘటన 2024 ఫిబ్రవరిలో జరిగింది. నల్లగండ్లలోని పాఠశాలలో పనిచేసే 30 ఏళ్ల సెక్యూరిటీ గార్డు.. బాలుడిని ఆడియో, విజువల్ గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత బాలుడు జరిగిన విషయాన్ని తండ్రికి చెప్పడంతో విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. కేసును విచారించిన ప్రత్యేక పోక్సో కోర్టు ఈ ఏడాది జూలైలో నిందితుడిని దోషిగా తేల్చింది. అతడికి 5 ఏళ్ల జైలు శిక్ష విధించడంతో పాటు బాధిత బాలుడికి రూ.1 లక్ష పరిహారం అందించాలని ఆదేశించింది.మరో ఘటనలో 10 ఏళ్ల బాలుడిపై అతడి పొరుగింట్లో ఉండే బంధువు పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. 2023 డిసెంబర్‌లో కామాటిపుర పోలీసులు కేసు నమోదు చేశారు. 29 ఏళ్ల నిందితుడు టీవీ చూపిస్తానంటూ బాలుడిని తన ఇంటికి పిలిచి లైంగిక దాడికి పాల్పడినట్లు కేసు నమోదైంది. ఈ విషయం ఎవరికైనా చెబితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బాలుడిని బెదిరించినట్లు అధికారులు తెలిపారు. దీంతో కొంతకాలం బాలుడు మౌనంగా ఉన్నాడు. చివరకు నొప్పి, రక్తస్రావం రావడంతో జరిగిన విషయాన్ని తండ్రికి చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.ఈ కేసులో ప్రత్యేక పోక్సో కోర్టు ఈ ఏడాది ఏప్రిల్‌లో నిందితుడిని దోషిగా నిర్ధారించి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. బాధిత బాలుడి తక్షణ అవసరాలు, వైద్యం, విద్య కోసం రూ.75 వేల పరిహారం అందించాలని సిఫార్సు చేసింది. తెలంగాణలో బాలురపై లైంగిక నేరాలకు సంబంధించి నమోదైన గణాంకాలు సమస్యలో ఒక భాగాన్ని మాత్రమే చూపిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. పోలీసుల వరకు చేరని ఘటనలు కూడా ఉండే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. పిల్లలు భయంతో, కుటుంబ సభ్యులు సామాజిక ఒత్తిళ్ల కారణంగా మౌనం పాటిస్తే నేరాలు అధికారిక రికార్డుల్లోకి ఎక్కవని చెబుతున్నారు.అందుకే బాలల ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు కనిపించినప్పుడు తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించాలని.. పిల్లలు చెప్పే విషయాలను నిర్లక్ష్యం చేయకుండా వారి మాటలను నమ్మి స్పందించాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా తమకు తెలిసిన వ్యక్తుల నుంచే ప్రమాదం ఎదురయ్యే అవకాశాన్ని కూడా విస్మరించకూడదని చెబుతున్నారు. 2026లో కేవలం 9 నెలల్లోనే 62 మంది బాలురు పోక్సో కేసుల్లో బాధితులుగా నమోదవడం.. బాలుర భద్రత, అవగాహన, ఫిర్యాదు వ్యవస్థలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని మరోసారి ముందుకు తెచ్చింది.

కొనసాగుతున్న మొగలి పువ్వులు

శ్రీకాకుళం ,కాకుళం జిల్లాలో రైతులు వినూత్నంగా మొగలి సాగు చేస్తున్నారు. మొగలి మొక్కల్ని నాటి పుష్పాలతో లాభాలు పొందుతున్నారు. మొగలి పుష్పాల నుంచి తీసిన ఆయిల్‌తో భారీగా ఆదాయం వస్తోంది. మొగలి పువ్వుల నుంచి తీసిన ఆయిల్ లీటర్ రూ.2.50 లక్షలు పలకుతోంది.. సీజన్‌లో అంతకుమించి కూడా డిమాండ్ ఉంటోంది. ఈ ఆయిల్‌ను ఇతర రాష్ట్రాలు, విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు.మొగలి పువ్వుల గురించి మనం వినే ఉంటాం.. కొంతమంది ఇళ్ల దగ్గర ఈ మొగలి చెట్లను పెంచుతుంటారు. రైతులు పొలాలు, కాలువ గట్లపై కూడా పెంచుతారు. తీర ప్రాంతాల్లో ఉండే భూములకు ఈ మొగలి చెట్లు ఎత్తుగా, దట్టంగా పెరిగి రక్షణ గోడగా నిలుస్తాయి. అలాంటి మొగలి చెట్లు శ్రీకాకుళం జిల్లాలో రైతులకు ఆదాయాన్ని తెస్తున్నాయి.. పలు మండలాల్లో దాదాపు 6 వేల హెక్టార్లలో మొగలిని సాగు చేస్తున్నారు. ఈ మొగలి పువ్వుల్ని ఎగుమతి చేసి ఆదాయాన్ని పొందుతున్నారు. ఇక్కడి నుంచి మొగలి పువ్వులు విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు.ఒక్క కొమ్మ నాటితే ఏడాదిలోగా పిలకలువేస్తూ కంచెగా మారుతుంది. అలాగే ఈ చెట్లకు తెగుళ్లు కూడా రావు.. చుక్కనీరూ అవసరం లేదు. ఏడాదిలో ఒక్కో మొగలి చెట్టు నుంచి నాలుగు నెలల పాటు వెయ్యి పూల వరకు వస్తాయి. మొగలి పువ్వును రైతులు దాదాపు రూ.14 నుంచి 16 వరకు విక్రయిస్తున్నారు. అదే సీజన్‌లో అయితే ఈ ధర ఎక్కువగా ఉంటుంది. జులై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఈ పూలకు డిమాండ్ ఉంటుంది. అంతేకాదు శ్రీకాకుళం జిల్లాలో ఈ మొగలి పువ్వుల నుంచి అత్తరు తయారు చేసే పరిశ్రమలు కూడా ఉన్నాయి. అక్కడ ఇత్తడి పాత్రల్లో ఈ మొగలి పువ్వులను వేసి వేడి చేస్తారు.. అనంతరం అందులో నుంచి వచ్చే ఆవిరినిమరో పాత్రలోకి వెళ్లేలా చూస్తారు. అక్కడ చల్లబడిన నూనెను మరో పాత్రలో నిల్వ చేస్తారు.ఈ నూనె సీజన్‌ను బట్టి లీటర్ రూ.2.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు పలుకుతుంది. శ్రీకాకుళం జిల్లా నుంచి ఈ నూనెను చైనా, రష్యా, అమెరికా వంటి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తారు. కాన్పూర్, భువనేశ్వర్, జైపూర్, కోల్‌కతా వ్యాపారులు కూడా ఈ ద్రావణాన్ని కొనుగోలు చేస్తారు. ఈ ద్రావణం ఒక లీటరు సేకరించాలంటే.. దాదాపు 20వేల మొగలి పువ్వులు కావాలి. ఈ ద్రావణాన్ని కాస్మెటిక్స్, ఔషధాల్లో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. అంతేకాదు కీళ్ల సంబంధిత వాత నొప్పులు తగ్గిస్తుందని చెబుతుంటారు. ఈ మొగలి పువ్వల నుంచి తీసే ద్రావణాన్ని ఒడిశాలోని అగర్‌బత్తీల తయారీకి కూడా పంపిస్తుంటారు. ఈ మొగలి సాగు కూడా వ్యవసాయ అనుబంధంగా ఉందని.. తమకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తే బావుంటుందని రైతులు కోరుతున్నారు.వాస్తవానికి సముద్ర తీర ప్రాంతాలతో పాటుగా కొబ్బరి, జీడిమామిడి తోటలకు రైతులు కంచెలా ఈ మొగలి మొక్కల్ని పెంచుతుంటారు. పొలం గట్లపై, కాలవ గట్లపై కనిపించే ఈ మొగలి చెట్లు ఇప్పుడు రైతులకు ఆదాయాన్ని తీసుకొచ్చేవిగా మారాయి. కొంతమంది రైతులు కొబ్బరి తోటలతో నష్టాలు వచ్చాయని.. వాటిని తొలగించి మొగలి మొక్కల్ని నాటుతున్నారు. ఈ పుష్పాల ద్వారా ఆదాయాన్ని పొందుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో రైతులు మాత్రమే కాదు మరికొన్ని చోట్ల కూడా కొంతమంది మొగలి సాగుకు సిద్ధమవుతున్నారు.

నెల్లూరు మేయర్ అభ్యర్థి ఖరారు...

నెల్లూరు, ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల సమరానికి సంబంధించి అధికారిక నోటిఫికేషన్, రిజర్వేషన్ల ప్రక్రియ ఇంకా కొలిక్కి రాకముందే.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ ఆనం విజయ్‌కుమార్ రెడ్డి పేరును పార్టీ తరఫున అధికారికంగా ఖరారు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వైసీపీ ప్రకటించిన మొట్టమొదటి మేయర్ అభ్యర్థి ఆనమే.ఆనం కుటుంబంలో చాలా కాలం క్రితమే చీలిక వచ్చింది. ఆనం విజయ్ కుమార్ రెడ్డితో ఇతర సోదరులకు సంబంధాల్లేవు. విజయ్‌కుమార్ రెడ్డి చాలాకాలంగా పార్టీలోనే కొనసాగుతున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల వేళ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి టీడీపీలోకి ఫిరాయించడంతో, నెల్లూరు రూరల్ బాధ్యతలను జగన్ ఆయనకే అప్పగించారు. అటు ఆనం విజయ్‌కుమార్ రెడ్డి సతీమణి అరుణమ్మ గతంలో నెల్లూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. ఆనం కుటుంబానికి నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాత పరిచయాలు, బలమైన క్యాడర్ బలం కార్పొరేషన్ పోరులో పార్టీకి ఉపయోగపడుతుందన్న లెక్కలతోనే జగన్ ఈ ముందస్తు ప్రకటన చేసినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.నెల్లూరు వైసీపీలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఆదాల ప్రభాకర్ రెడ్డి, కాకాని గోవర్ధన్ రెడ్డి వర్గాల మధ్య సమన్వయం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ ఎవరి వాదన వినకుండా ఆనం విజయ్ కుమార్ ను మేయర్ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల నగరంలోని ఇతర వర్గాల ఆశావహులు, ద్వితీయ శ్రేణి నేతలు ఏ మేరకు సహకరిస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. టీడీపీ తరఫున నెల్లూరు నగరంలో మంత్రి నారాయణ, రూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలు ఎమ్మెల్యేలుగా చక్రం తిప్పుతూ క్షేత్రస్థాయిలో తిరుగులేని పట్టు సాధించారు. ధికార పక్షాన్ని ఎదుర్కోవడానికి అవసరమైన ఆర్థిక, అంగబలాన్ని సమకూర్చుకోవడం వైసీపీకి పెను సవాలే. అంతర్గత గ్రూపు విభేదాలను చక్కదిద్దకుండా, రిజర్వేషన్లు తేలకుండానే ముందస్తుగా విసిరిన ఈ మేయర్ పాచికతో జగన్ పార్టీ కేడర్‌ను ఎన్నికల సమరానికి సిద్ధం చేయగలరా లేక అసంతృప్తుల రూపంలో కొత్త తలనొప్పులు కొనితెచ్చుకున్నారా

ఐసీఈ పైరింగ్ ..! న్యూయార్క్‌లో కలకలం



న్యూయార్క్,అమెరికాలో వలసదారులపై అమలవుతున్న కఠిన చర్యల నేపథ్యంలో మరో కాల్పుల ఘటన చోటుచేసుకుంది. న్యూయార్క్ నగరంలోని బ్రాంక్స్ ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం ఫెడరల్ ఇమిగ్రేషన్ ఏజెంట్లు జరిపిన కాల్పుల్లో 28 ఏళ్ల వ్యక్తి గాయపడ్డాడు. ఆ సమయంలో అతని కారులో వెనుక సీటులో ఐదేళ్ల చిన్నారి కూడా ఉన్నాడు. అయితే ఆ చిన్నారికి ఎలాంటి గాయాలు కాలేదని న్యూయార్క్ పోలీసు విభాగం తెలిపింది. గాయపడిన వ్యక్తి మెడకు బుల్లెట్ తగిలి స్వల్ప గాయమైందని, అతడి పరిస్థితి ప్రాణాపాయంగా లేదని అధికారులు వెల్లడించారు.

లక్షిత ఆపరేషన్..

గురువారం సాయంత్రం నాలుగు గంటల తర్వాత (భారత కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగినట్లు పోలీసు వర్గాల ప్రాథమిక సమాచారం. అక్రమ వలసదారులను గుర్తించి అరెస్టు చేసే బాధ్యతలు నిర్వహించే అమెరికా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) విభాగంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ ఏజెంట్లు.. తాము లక్ష్యంగా చేసుకున్న వ్యక్తిని ఎదుర్కొన్న సమయంలో కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఏజెంట్లు వ్యక్తి ప్రయాణిస్తున్న కారుపై కాల్పులు జరిపినట్లు ఓ పోలీసు అధికారి వెల్లడించారు. అయితే కాల్పులకు దారితీసిన పరిస్థితులేమిటి? వ్యక్తి నుంచి ఏదైనా ముప్పు ఎదురైందా? అనే అంశాలపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించలేదు.

డొమినికన్ రిపబ్లిక్ వ్యక్తే లక్ష్యం

అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్ఎస్) ప్రకటన ప్రకారం.. డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన, గతంలో నేరారోపణలు ఎదుర్కొన్న వ్యక్తిని అరెస్టు చేసేందుకు ఫెడరల్ ఏజెంట్లు లక్షిత ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలో ఓ ఫెడరల్ ఏజెంట్ తుపాకీతో కాల్పులు జరపడంతో అతడు గాయపడ్డాడు. ఆ వ్యక్తికి ట్రినిటారియోస్ గ్యాంగ్‌తో సంబంధాలున్నాయని డీహెచ్ఎస్ ఆరోపించింది. కాల్పుల అనంతరం ఏజెంట్లు వెంటనే అతడికి ప్రాథమిక సాయం అందించినట్లు పేర్కొంది. అయితే ఆపరేషన్ సందర్భంగా అసలు ఏం జరిగిందన్న విషయాన్ని మాత్రం వివరించలేదు.

గతంలోనూ నేరారోపణలు.. ఐదేళ్ల ప్రొబేషన్

గాయపడిన వ్యక్తికి సంబంధించిన నేర చరిత్రపై పోలీసు వర్గాలు కొన్ని వివరాలు వెల్లడించాయి. 2023లో దోపిడీ కేసులో అతడిని అరెస్టు చేశారని, అనంతరం తక్కువ తీవ్రత కలిగిన గ్రాండ్ లార్సెనీ (దొంగతనం) అభియోగాన్ని అంగీకరించడంతో ఐదేళ్ల ప్రొబేషన్ విధించినట్లు తెలిపాయి. నియంత్రిత మాదక పదార్థాల విక్రయానికి సంబంధించిన మరో కేసులోనూ అతడిపై అభియోగాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నాయి.గత నేర చరిత్రకు సంబంధించిన వివరాలు వెల్లడైనప్పటికీ.. తాజా ఘటనలో కాల్పులకు దారితీసిన పరిస్థితులపై స్పష్టత రావాల్సి ఉంది.

ఇద్దరు ఏజెంట్లకూ గాయాలు

ఈ ఘటనలో మరో ఇద్దరు ఏజెంట్లు కూడా గాయపడినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఒకరు కారు ప్రమాదంలో గాయపడి ఉండవచ్చని ఓ ఫెడరల్ అధికారి పేర్కొన్నారు. అయితే ఆ ప్రమాదం అరెస్టు ప్రయత్నంలో భాగంగా జరిగిందా? లేక ఘటన అనంతరం స్పందించే క్రమంలో చోటుచేసుకుందా? అనేది స్పష్టంగా తెలియరాలేదు.కాల్పుల సమయంలో పసుపు రంగు నిర్మాణ కార్మికుల జాకెట్ ధరించిన వ్యక్తి తుపాకీ పట్టుకుని ఉండటాన్ని చూశామని ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. ఐదు నుంచి ఆరు రౌండ్ల కాల్పుల శబ్దాలు వినిపించాయని, ప్రజలు కేకలు వేయడం కూడా విన్నామని సాక్షులు చెప్పినట్లు పేర్కొన్నారు. ఘటనాస్థలానికి సంబంధించినదిగా ప్రచారంలో ఉన్న ఓ వీడియోలో.. ఆ వర్ణనకు సరిపోయే వ్యక్తి సెమీ ఆటోమేటిక్ రైఫిల్ పట్టుకుని, మెడలో ఐసీఈ గుర్తింపు కార్డు ధరించి ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే వీడియోలో కనిపించిన వ్యక్తి వివరాలు, ఘటనలో అతడి పాత్ర

ట్రంప్ వేస్తున్న రాళ్లన్నీ పడేది అమెరికా పైనే !



వాషింగ్టన్:చరిత్రలో అమెరికాను నమ్ముకుని నిలబడిన మిత్రదేశం ఏదీ లేదన్న చేదు నిజాన్ని మరోసారి వాషింగ్టన్ విధానాలే నిరూపిస్తున్నాయి. ప్రపంచ శాంతి ముసుగులో మధ్యప్రాచ్యంలో ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని సాగించిన అనాలోచిత యుద్ధాలు, ఆంక్షల పర్యవసానంగా సంపన్న గల్ఫ్ దేశాల ఆర్థిక వ్యవస్థలు అల్లకల్లోలమయ్యాయి. ఇక ఇండో-పసిఫిక్‌లో అత్యంత విశ్వసనీయ భాగస్వామిగా భావించే భారత్ విషయంలోనూ అమెరికా ద్వంద్వ నీతి స్పష్టంగా బయటపడింది. చైనా వంటి ప్రత్యర్థి దేశాల కంటే ఘోరంగా.. భారతీయ ఉత్పత్తులపై విచక్షణారహితంగా దిగుమతి సుంకాలు మోపడం, విద్యార్థులు, నిపుణుల వీసాలపై ఆంక్షల కొరడా ఝళిపించడం ద్వారా దౌత్యపరమైన విశ్వసనీయతను తుంగలో తొక్కింది.

పెర్మ్ పై వేటు అమెరికా స్వార్థానికి పరాకాష్ట

తాజాగా అమెరికా కార్మిక శాఖ భారతీయ ఐటీ దిగ్గజాలపై తీసుకున్న పెర్మ్ సస్పెన్షన్ వేటు ట్రంప్ నేతృత్వంలోని స్వార్థపూరిత విధానాల పరాకాష్ట. అమెరికా అంటేనే వలసదారుల మేధో సంపత్తితో అభివృద్ధి చెందిన దేశం అన్న మూల సిద్ధాంతాన్ని వైట్‌హౌస్ వర్గాలు మర్చిపోయాయి. గత మూడు దశాబ్దాలుగా సిలికాన్ వ్యాలీ అమెరికా టెక్ సామ్రాజ్యానికి ఆయువుపట్టుగా నిలవడానికి కారణం స్థానిక అమెరికన్ పాలసీలు మాత్రమే కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి మేధావులను, ప్రత్యేకించి భారతీయ ఇంజనీర్లను చట్టబద్ధమైన వీసాలు, పెర్మ్ సర్టిఫికేషన్ల ద్వారా రప్పించి రాత్రింబగళ్లు చెమటోడ్చేలా చేయడమే. మైక్రోసాఫ్ట్, గూగుల్, అడోబ్ వంటి దిగ్గజాల పునాదులు మొదలుకొని బ్యాంకింగ్, ఏరోస్పేస్ వరకు అమెరికన్ కంపెనీల డిజిటల్ సామ్రాజ్యాలు నిలబడిందే భారతీయుల సాంకేతిక నైపుణ్యంపై. అలాంటి గ్రీన్ కార్డ్ ప్రాసెసింగ్‌ను అడ్డుకోవడం అంటే.. తమ ఇంటికి వెలుగునిచ్చే దీపాన్ని స్వయంగా ఆర్పేసుకోవడమే.

ప్రతిభను వెళ్లగొడితే ఎవరికి నష్టం ?

అయితే డొనాల్డ్ ట్రంప్, జేడీ వాన్స్ బృందం ఈ చిన్నపాటి ఆర్థిక లాజిక్‌ను పూర్తిగా మిస్సవుతున్నారు. అమెరికన్ల ఉద్యోగాలను రక్షిస్తున్నామన్న సంకుచిత పాపులిస్ట్ నినాదంతో విదేశీ ప్రతిభను వెళ్లగొడితే ఆ ఖాళీలను భర్తీ చేసేందుకు అవసరమైన అర్హత కలిగిన మ్యాన్‌పవర్ అమెరికాలో ఉందా అంటే సమాధానం శూన్యం. చవకైన, నాణ్యమైన నైపుణ్యాన్ని అమెరికన్ గడ్డపైకి రానివ్వకుండా అడ్డుకుంటే నష్టపోయేది భారత ఐటీ సంస్థలు మాత్రమే కాదు, వారిపైనే ఆధారపడి మనుగడ సాగిస్తున్న వేలాది అమెరికన్ కార్పొరేట్ సంస్థలే. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్లౌడ్ కంప్యూటింగ్ యుగంలో అర్హులైన నిపుణులను దూరం చేసుకోవడం అంటే సాంకేతిక ఆవిష్కరణలలో అమెరికా ప్రపంచ నాయకత్వాన్ని స్వయంగా చైనా , ఇతర దేశాలకు ప్లేట్లో పెట్టి అప్పగించడమే.

టెక్ రంగంలోనూ అమెరికా పతనమే

దీర్ఘకాలికంగా చూస్తే అమెరికా విధించే ఈ సంకుచిత ఆంక్షలు భారత్‌కు, గ్లోబల్ టెక్ రంగానికి ఒక రకంగా గొప్ప వరమనే చెప్పాలి. విదేశీ వీసాల కోసం, గ్రీన్ కార్డుల కోసం దశాబ్దాల తరబడి అమెరికా దయాదాక్షిణ్యాలపై ఆధారపడే బానిస సంకెళ్లను తెంచుకునేందుకు మన యువ నిపుణులకు ఇది సువర్ణావకాశం. ఇకపై భారతీయ టెక్ బ్రెయిన్స్ అమెరికాకు తరలివెళ్లాల్సిన పనిలేదు. హైదరాబాద్, బెంగళూరు కేంద్రాలుగానే గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు విస్తరిస్తూ, ప్రపంచ స్థాయి సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు స్వదేశం నుంచే రూపుదిద్దుకుంటాయి. ప్రతిభ ఉన్న చోటుకే మూలధనం పరుగెత్తుకొస్తుంది. గర్వంతో, రక్షణాత్మక విధానాలతో ప్రతిభను తరిమేస్తున్న అమెరికా.. రాబోయే రోజుల్లో సాంకేతిక రంగంలో తన ఏకాధిపత్యాన్ని కోల్పోవడం ఖాయం.

తిరుపతి,చిత్తూరు మేయర్ పీఠాలు దక్కేదెవరికో?



తిరుపతి,స్థానిక సంస్థల ఎన్నికల వేడి రోజురోజుకూ పెరుగుతోంది. సుప్రీంకోర్టులో కేసుల సంగతి తేలిన వెంటనే, ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని రాష్ట్ర ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు.అయితే ఎన్నికలు వస్తాయనే ఉద్దేశంతోనే రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాయి. రిజర్వేషన్లు తేలితే, అభ్యర్థుల ఎంపిక సులువవుతుంది.ఈ నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రెండు కార్పొరేషన్లపై అందరి దృష్టి పడింది. తిరుపతి, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్లలో పాగా వేయాలని కూటమి, వైసీపీ పోటీ పడుతున్నాయి.ఇటీవలే డివిజన్లు కూడా పెరిగాయి. ముందుగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ గురించి తెలుసుకుందాం. ఇక్కడ గతంలో 50 డివిజన్లు వుండేవి. ప్రస్తుతం ఆ సంఖ్య 60కి పెరిగింది. వైసీపీ హయాంలో ఆ పార్టీ కార్పొరేషన్‌ను హస్తగతం చేసుకుంది.అయితే ఈ దఫా ఎలాగైనా కార్పొరేషన్‌ను సొంతం చేసుకోవాలని కూటమి నేతలు తహతహలాడుతున్నారు. ప్రధానంగా చిత్తూరు కార్పొరేషన్‌ను టీడీపీ కోరకుంటోంది.అయితే పొత్తులో భాగంగా తమకు కావాలని జనసేన డిమాండ్ చేస్తోంది. అయితే రాజకీయ బలాబలాల్ని పరిశీలిస్తే టీడీపీకే చిత్తూరు మేయర్ స్థానాన్ని ఇచ్చే అవకాశాలు ఎక్కువ. ఇక్కడి నుంచి టీడీపీ ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.అధికారంలో వుండడంతో మేయర్ స్థానాన్ని ఆశించే టీడీపీ నాయకులు ఎక్కువ సంఖ్యలో కనిపిస్తున్నారు.ప్రధానంగా చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) చైర్‌పర్సన్, మాజీ మేయర్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు సతీమణి సీకే లావణ్య, చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.మేయర్ సీటు బీసీకైతే సీకే లావణ్యకు లైన్ క్లియర్ అవుతుంది. ఎమ్మెల్యే మద్దతు ఇప్పటికే లావణ్యకు వున్నట్టు సమాచారం. అయితే గత రాజకీయ చేదు అనుభవాల రీత్యా సీకే లావణ్యను సొంత పార్టీలోనే చాలా మంది వ్యతిరేకిస్తున్నారు.మరోవైపు కటారి హేమలత చుడా చైర్‌పర్సన్ పదవితో సంతృప్తి చెందడం లేదు. మళ్లీ మేయర్ సీటు కావాలని ఆమె పట్టుపడుతున్నారు. ఇదిలా వుండగా జనసేన కోటాలో దీకే ఆదికేశవులునాయుడు మనవరాలు చైతన్య లలితాంబిక సీటు ఆశిస్తున్నారు.వైసీపీ విషయానికి వస్తే నలుగురైదుగురు రేస్‌లో ఉన్నారు. చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి సతీమణి ఇందుమతితో పాటు హరిణిరెడ్డి, రాహుల్ రాజా రెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.బీసీలకు రిజర్వ్ అయితే జ్ఞాన జగదీశ్, లాయర్ చంద్రశేఖర్ లలో ఎవరికో ఒకరికి కేటాయించొచ్చనే మాట వినిపిస్తోంది. వీరిలో హరిణిరెడ్డి, రాహుల్‌రాజారెడ్డిలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి సన్నిహితులనే పేరు వుంది.ఏది ఏమైనా విజయానందరెడ్డి నిర్ణయానికే అధిష్టానం ఓటు వేసే అవకాశం వుంది. అధికారంలో ఉన్నోళ్ల దౌర్జన్యాలను ఎదుర్కొని, చిత్తూరు మేయర్ సీటును సాధించాలనే పట్టుదలతో విజయానందరెడ్డి తీవ్రంగా కృషి చేస్తున్నారు. ముఖ్యంగా డబ్బు విషయంలో విజయానందరెడ్డి ధారాళంగా వుంటారనే పేరు వుంది.రిజర్వేషన్ల వెల్లడి తర్వాత, పోటీ రసవత్తరం అని చెప్పక తప్పదు. ఇటీవల కాలంలో వైసీపీ చిత్తూరులో బాగా బలపడింది. అధికార దుర్వినియోగం జరగకపోతే, మేయర్ పీఠం తమదే అని వైసీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.తిరుపతి కార్పొరేషన్‌లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక్కడ దివిజన్లు 50 నుంచి 66కి పెరిగాయి. తిరుపతి కార్పొరేషన్‌లో మొన్నటి వరకు వైసీపీదే హవా.కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక, రాజకీయ సమీకరణలు మారాయి. వైసీపీ నుంచి కొంత మంది కార్పొరేటర్లు టీడీపీ, జనసేన పార్టీల్లో చేరారు.గత సార్వత్రిక ఎన్నికల్లో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఇక్కడి నుంచి గెలుపొందారు. పొత్తులో భాగంగా జనసేనకే మేయర్ పీఠం కేటాయించే అవకాశాలు ఎక్కువని చెబుతున్నారు.ఇటీవల చంద్రబాబుతో పవన్ భేటీలో కూడా తాము ప్రాతినిధ్యం వహించే చోట మేయర్, మున్సిపల్ చైర్మన్ల సీట్లను ఇవ్వాలని పట్టుపట్టినట్టు వార్తలొచ్చాయి.అయితే తిరుపతి మేయర్ సీటును తమకు కేటాయించాలని టీడీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అప్పుడే బ్యాలెన్స్ అవుతుందనేది టీడీపీ నేతల వాదన.ఇక్కడి నుంచి మేయర్ సీటును ఆశిస్తున్న వాళ్ల సంఖ్య ఎక్కువే. దంపూరి భాస్కర్, అన్నా అనిత, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మనవరాలు కీర్తి, వూకా విజయ్‌కుమార్, ఒక ప్రముఖ స్కూల్ అధినేత ప్రణీత్ తదితరులు కూటమి తరపున మేయర్ రేస్‌లో ఉన్నారు.ఎందుకనో కిరణ్ రాయల్ మాత్రం వెనుకబడ్డారు. టీడీపీ ఇన్‌చార్జ్ జేబీ శ్రీనివాస్ మద్దతు మాత్రం దంపూరి భాస్కర్‌కు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. జనసేన మేయర్ అభ్యర్థి ఎవరనేది నేరుగా పవన్‌కల్యాణే ఎంపిక చేస్తారని అంటున్నారు.ఇక వైసీపీ నుంచి ప్రతిచోటా పోటీ చేయడానికి మొదట ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ మేరకు వైసీపీ ఇన్‌చార్జ్ భూమన అభినయ్ తీవ్ర కసరత్తు చేస్తున్నారు. అయితే రిజర్వేషన్ల ప్రక్రియ తేలితే అభ్యర్థులపై మరింత క్లారిటీ వచ్చే అవకాశం వుందని అంటున్నారు.మేయర్ సీటును బీసీ, లేదా జనరల్‌కు కేటాయించినా, వైసీపీ తరపున మాజీ మేయర్, మచ్చలేని నాయకురాలు డాక్టర్ శిరీషనే బరిలో నిలిపే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.చేతిలో అధికారం ఉండడంతో, దౌర్జన్యాలు, ఇతరత్రా అప్రజాస్వామిక పద్ధతుల్లో కూటమి నేతలు వెళితే తప్ప, తిరుపతి మేయర్ సీటును కూటమి కైవసం చేసుకోవడం అంత ఈజీ కాదు.ఎందుకంటే, జనసేనకే మేయర్ సీటు ఇస్తే, టీడీపీ పూర్తిస్థాయిలో మద్దతు ఇచ్చే ప్రశ్నే వుండదంటున్నారు. ఒకవేళ టీడీపీకి కేటాయిస్తే, జనసేన మద్దతు కూడా అంతంత మాత్రంగానే వుంటుందని చెబుతున్నారు.ఏది ఏమైనా ఎన్నికలు జరిగే తీరుపై తిరుపతి మేయర్ సీటు ఎవరనేది ఆధారపడి వుంటుంది. ప్రస్తుతానికైతే కూటమి, వైసీపీ నేతలు మాత్రం అభ్యర్థుల ఎంపికపై తలమునకలై ఉన్నారు.

రేవంత్‌ను పక్కన పెడితే ఇండీ కూటమిలోకి బీఆర్ఎస్!?



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుసరిస్తున్న సరికొత్త రాజకీయ పంథా వెనుక ఓ ప్లాన్ ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీని, గాంధీభవన్ సంస్కృతిని తీవ్రంగా నిందించిన కేటీఆర్.. ఇప్పుడు వ్యూహాత్మకంగా రేవంత్‌రెడ్డిని మాత్రమే టార్గెట్ చేస్తూ రాహుల్ గాంధీకి పదే పదే ఫిర్యాదులు చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ఆయన సంధిస్తున్న అస్త్రాల్లో అంతర్గత సందేశం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. రేవంత్‌ను రాహుల్ కీలుబొమ్మ , అన్‌లిమిటెడ్ ఏటీఎం అంటూ దిస్తూనే, ఆయన్ను కంట్రోల్ చేయాలని రాహుల్ గాంధీకి విజ్ఞప్తులు చేయడం వెనుక పెద్ద రాజకీయ మతలబే ఉంది. గతంలో గాంధీభవన్‌లో గాడ్సే తిరుగుతున్నాడు" అని కేటీఆర్ స్వయంగా ఎద్దేవా చేశారు. అంటే పరోక్షంగా గాంధీభవన్ మంచిదే కానీ, అక్కడ కూర్చున్న రేవంత్ రెడ్డి మాత్రమే చెడ్డవాడన్నట్లుగా చిత్రీకరిస్తూ.. రేవంత్‌ను ఏకాకిని చేసి పక్కనపెట్టించాలన్నది కేటీఆర్ తాజా ఎత్తుగడగా స్పష్టమవుతోంది.

రేవంత్‌ను టార్గెట్ చేయడం కొత్త కాదు!

ఈ తరహా రాజకీయ వ్యూహం రేవంత్‌రెడ్డి విషయంలో కేటీఆర్‌కు కొత్తేమీ కాదు. గతంలో రేవంత్ రెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా నియమించవద్దని, ఆయన చేతికి పగ్గాలు వెళ్లకుండా అడ్డుకోవాలని బీఆర్ఎస్ సర్కార్ చేయని ప్రయత్నం లేదు. పీసీసీ రేసులో రేవంత్ పేరు తెరపైకి వచ్చిన ప్రతిసారీ ఆయనపై వరుస కేసులు బనాయించడం, జైలుకు పంపి రాజకీయ భవిష్యత్తును దెబ్బతీయాలని చూడటం వంటి అణచివేత చర్యలు నడిచాయి. కానీ ఆ వ్యూహాలేవీ ఫలించలేదు. రేవంత్ అన్ని అడ్డంకులను అధిగమించి పీసీసీ చీఫ్ అయ్యారు, ఆపై ఏకంగా బీఆర్ఎస్ పదేళ్ల కోటను బద్దలుకొట్టి ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకున్నారు. నాడు రేవంత్ ఎదుగుదలను అడ్డుకోలేకపోయిన కేటీఆర్, నేడు అధికారం కోల్పోయాక సరికొత్త రూట్ ఎంచుకున్నారు. రేవంత్‌ను తప్పిస్తే లేదా ఆయన దూకుడుకు కళ్లెం వేస్తే.. భవిష్యత్తులో తాము కేంద్రంలో కాంగ్రెస్‌తో సఖ్యతగా ఉండటానికి లేదా దగ్గర కావడానికి ఎలాంటి అభ్యంతరం లేదన్న సంకేతాలను ఢిల్లీ అధిష్ఠానానికి పంపే ప్రయత్నం చేస్తున్నారు.

కేటీఆర్ మైండ్ గేమ్ ను పట్టించుకోని కాంగ్రెస్

కేటీఆర్ వేస్తున్న ఈ మైండ్ గేమ్‌ను, సయోధ్య సంకేతాలను కాంగ్రెస్ హైకమాండ్ నమ్ముతుందా అంటే 'అసాధ్యం' అనే సమాధానమే వినిపిస్తోంది. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీకి గులాబీ దళంతో చేదు అనుభవాలు తప్ప మరేమీ మిగలలేదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీని తెలంగాణ తల్లి గా కీర్తించి, రాష్ట్రం ఏర్పడ్డాక తమ టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తామని నాటి ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఇచ్చిన హామీని తుంగలో తొక్కారు. ఆ తర్వాత అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను మూకుమ్మడిగా లాగేసుకుని, అసలు తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ అనే పార్టీయే లేకుండా చేయాలని పదేళ్ల పాటు బీఆర్ఎస్ అధినాయకత్వం పదరాని పాట్లు పడింది. అలాంటి చరిత్రను రాహుల్ గాంధీ గానీ, కాంగ్రెస్ అధిష్ఠానం గానీ అంత తేలిగ్గా మర్చిపోతాయని అనుకోవడం లేదు.

కేటీఆర్ ప్రయత్నాలు చెల్లవు!

ప్రస్తుతం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి కేవలం ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి మాత్రమే కాదు ..కూటమికి రాజకీయంగా అండగా నిలుస్తున్న తిరుగులేని మాస్ లీడర్. అలాంటి పూర్తి స్థాయి విశ్వసనీయత ఉన్న బలమైన నేతను కాదని, పదేళ్లు కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా చేయాలని చూసి నేడు సంక్షోభంలో పడ్డ బీఆర్ఎస్ కోసం రాహుల్ గాంధీ రేవంత్‌ను పక్కనపెడతారనుకోవడం పగటి కలే. గాంధీభవన్‌ను, రేవంత్‌ను వేరుచేసి చూడటం ద్వారా కాంగ్రెస్ శ్రేణుల్లో చీలిక తేవాలని, తద్వారా రేవంత్ రాజకీయ దెబ్బల నుంచి తప్పించుకోవాలని కేటీఆర్ పన్నుతున్న ఈ వ్యూహం కాంగ్రెస్ దగ్గర పారే అవకాశం లేదు.

54 మందికి ఒకే ఇల్లు అమ్మకం

హైదరాబాద్, హైదరాబాద్ నగరంలో ఆస్తి మోసాల ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ పుంజుకోవటం, నగరంలో ప్రాపర్టీలకు డిమాండ్ పెరగటంతో మోసాలు కూడా ఎక్కువవుతున్నాయి. తాజాగా.. ఒకే భవనాన్ని 54 మందికి విక్రయించి, తాకట్టు పెట్టి సుమారు రూ.4.5 కోట్లు వసూలు చేసిన వ్యవహారం బయటపడగా.. మరోచోట ప్రభుత్వ అధికారుల సంతకాలు, కార్యాలయాల సీళ్లు ఫోర్జరీ చేసి నకిలీ ఆస్తి పత్రాలు సృష్టించిన ముఠా గుట్టు రట్టయింది. ఇంకోవైపు ఖాళీగా ఉన్న భూములను గుర్తించి నకిలీ యజమానులను సృష్టించి విక్రయించేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. మూడు కేసుల్లో ఐదుగురిని అరెస్టు చేయగా.. పలువురు నిందితులు పరారీలో ఉన్నారు. నకిలీ పత్రాలతో ఆస్తి మోసాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని మల్కాజిగిరి సీపీ వి.సుమతి హెచ్చరించారు. మాదన్నపేట దారాబ్‌జంగ్ కాలనీలో గ్రౌండ్ ప్లోర్, రెండు అంతస్తులు, పెంట్‌హౌస్ ఉన్న భవనం రషాద్ ఉల్ ఖైర్, ముంతాజ్‌బేగం ఆధీనంలో ఉంది.

5 కోట్ల వరకు జీఎస్టీ ఎగ్గొట్టారా...



హైదరాబాద్,వస్తు, సేవల పన్ను.. జీఎస్టీ విధానంలో కీలక మార్పులు చేయనున్నారు. ఇప్పటి వరకు ఎవరైనా వ్యాపారులు పారిశ్రామిక వేత్తలు.. జీఎస్టీ ఎగ్గొట్టి ఉంటే.. వారిని విచారించేందుకు, అరెస్టు చేసేందుకు జీఎస్టీ అధికారులకు ప్రత్యేక పవర్ ఉండేది. ఈ క్రమంలోనే గతంలో ఏపీలో వైసీపీ పాలన సమయంలో ప్రస్తుత చిలకలూరి పేట ఎమ్మెల్యే (టీడీపీ) ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడిని అరెస్టు చేశారు. కానీ, ఇప్పుడు అలా చేయడానికి వీల్లేదు. తాజాగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ నేతృత్వంలోని జీఎస్టీ కౌన్సిల్ భేటీ జరిగింది. ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు.

- అరెస్టులకు చెక్: నిన్నటి వరకు వ్యాపారులకు కంట్లో నలుసుగా ఉన్న ఈ విషయంపై కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. ఎంత మొత్తంలో పన్నులు ఎగవేసినా.. వెంటనే జీఎస్టీ అధికారులు సరదు వ్యాపారులను, పారిశ్రామిక వేత్తలను కూడా అరెస్టు చేసే అధికారం ఉంది. కానీ, తాజాగా ఈ విధానాన్ని రద్దు చేశారు. ఇకపై వ్యాపారులకు.. కేవలం నోటీసులు ఇచ్చేందుకు మాత్రమే అధికారులు పరిమితం అవుతారు. న్యాయస్థానాలే శిక్షలు విధింపు, అరెస్టు ఆదేశాలు చేయనున్నాయి.

- 5 కోట్ల వరకు పెంపు: జీఎస్టీ చెల్లింపులో ఆలస్యమైతే.. ఇప్పటి వరకు అపరాధ రుసుము వసూలు చేసేవారు. ఇది కోటి రూపాయల వరకు పరిమితంగా ఉండేది. అంటే.. కోటి రూపాలయ వరకు ఎవరైనా ఎగ్గొట్టినా.. ఆలస్యం చేసినా వెంటనే అపరాధ రుసుము(జరిమానా) విధించేవారు. కానీ, తాజా నిర్ణయంలో ఈ పరిమితిని 5 కోట్ల రూపాయ ల వరకు పెంచారు.

- జరిమానా కోత: వ్యాపారులు జీఎస్టీని ఎగ్గొట్టి ఉంటే.. వారికి జరిమానా విధించేందుకు జీఎస్టీ చట్టం అనుమతి ఇస్తుంది. ప్రస్తుతం ఇది.. 25 వేల రూపాల వరకు ఉంది. అంటే.. ఒక సాధారణ వ్యాపారి జీఎస్టీ ఎగ్గొట్టి ఉంటే.. గరిష్ఠంగా 25 వేల రూపాయల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. ఇప్పుడు దీనిని గరిష్ఠంగా 10 వేలకు కుదించారు. అంతేకాదు, జీఎస్టీ వసూలు, వడ్డీ, నిబంధనలకు అనుగుణంగా మాత్రమే జరిమానా విధించనున్నారు.

- చిరు వ్యాపారులకు ఊరట: ఆన్‌లైన్ ద్వారా చిరు వ్యాపారాలు చేసుకునే వారికి తాజాగా జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చారు. అలాగే.. రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న ప్రత్యేక నిబంధనలు, పత్రాల సమర్పణ వంటి కీలక అంశాలను కూడా తప్పించారు. తద్వారా దేశంలో సొంతగా ఉపాధి మార్గాలు వెతుక్కునే వారికి ఇది ఊరటనివ్వనుంది.

కర్ణాటక రాజకీయాల్లో కలకలం.. స్టింగ్ ఆపరేషన్లపై డీకే అలర్ట్



బెంగళూర్ :కర్ణాటక రాజకీయాల్లో స్టింగ్ ఆపరేషన్ల అంశం తీవ్ర చర్చకు దారితీసింది. రాష్ట్ర మంత్రులను లక్ష్యంగా చేసుకుని రహస్యంగా నిఘా పెట్టి, స్టింగ్ ఆపరేషన్లు నిర్వహించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హెచ్చరించినట్లు వార్తలు వెలువడ్డాయి. దీనిపై కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తీవ్రంగా స్పందించారు. ఈ వ్యవహారం వెనుక డీకే శివకుమారే ఉన్నారంటూ ఆయన ఎదురుదాడికి దిగారు. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్ర నిర్ధారణ వెలువడలేదు.

ఐదుగురు మంత్రులపై నిఘా ఉందన్న డీకే

మంగళవారం జరిగిన కర్ణాటక మంత్రివర్గ సమావేశంలో డీకే శివకుమార్ ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. సుమారు ఐదుగురు మంత్రులను లక్ష్యంగా చేసుకుని రహస్యంగా రికార్డింగ్‌లు లేదా స్టింగ్ ఆపరేషన్లు నిర్వహించే అవకాశం ఉందని ఆయన హెచ్చరించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ప్రైవేటు సమావేశాలు, వ్యక్తిగత భేటీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రులకు సూచించినట్లు తెలుస్తోంది. ఈ చర్యల వెనుక దిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక ఏజెన్సీలు ఉన్నాయని, బీజేపీ, జేడీఎస్‌లకు సంబంధించిన ప్రయత్నాలు జరుగుతున్నాయని డీకే ఆరోపించినట్లు వార్తలు వెల్లడించాయి. అయితే, సంబంధిత ఏజెన్సీల గుర్తింపు, ఆరోపణలకు సంబంధించిన వివరాలు అధికారికంగా నిర్ధారణ కాలేదు.వార్తలు చదవండి

ఈడీ నిఘాపైనా సీఎం ఆందోళన

కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులపై కేంద్ర దర్యాప్తు సంస్థల నిఘా ఉందని డీకే శివకుమార్ గతంలోనూ ఆరోపించారు. సుమారు 40 మంది ఎమ్మెల్యేల ఆదాయ వనరులపై విచారణ జరుగుతోందని, భవిష్యత్తులో మరికొందరు మంత్రులు లక్ష్యంగా మారే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేసినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత సంస్థల అధికారిక వివరణ అందుబాటులో లేదు.

డీకే వ్యాఖ్యలపై కుమారస్వామి ఎదురుదాడి

డీకే శివకుమార్ హెచ్చరికలపై కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి విమర్శలు గుప్పించారు. మంత్రులను తన నియంత్రణలో ఉంచుకునేందుకే ముఖ్యమంత్రి స్టింగ్ ఆపరేషన్ల అంశాన్ని తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. గతంలో సిద్ధరామయ్యను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించే ప్రయత్నంలోనూ ఇలాంటి ఆపరేషన్లు కీలక పాత్ర పోషించాయని కుమారస్వామి ఆరోపించినట్లు వార్తలు వెల్లడించాయి. అయితే, కాంగ్రెస్ నేతలు కుమారస్వామి ఆరోపణలను రాజకీయ ప్రేరేపితమైనవిగా తోసిపుచ్చినట్లు ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. దీంతో కర్ణాటకలో స్టింగ్ ఆపరేషన్ల వ్యవహారం అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మరో రాజకీయ వివాదంగా మారింది.

విజయవాడ దసరా ఉత్సవాలకు దళపతి విజయ్.. ?



చెన్నై:తమిళనాడు సీఎం ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజయవాడలో అత్యంత వైభవంగా జరిగే ప్రసిద్ధ ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా విజయ్‌ను విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ ప్రత్యేక బృందం నేరుగా ఆహ్వానించింది. ఎంపీ బృందం ఆహ్వానానికి విజయ్ కూడా సానుకూలంగా స్పందించినట్లు, దసరా వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.ఇటీవల కాలంలో విజయ్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై, ఇక్కడి సామాజిక పరిస్థితులపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నట్లు ఆయన వ్యూహకర్తలు చెబుతున్నారు. తన పార్టీ భావజాలాన్ని, తమిళనాడు ప్రభుత్వ విజయాలను కేవలం సొంత రాష్ట్రానికే పరిమితం చేయకుండా తెలుగు ప్రజలకు కూడా చేరేలా ప్రత్యేకంగా తెలుగులో ప్రకటనలు ఇప్పించడం, టీవీ ఛానెళ్లలో ప్రసారం చేయించడం చేస్తున్నారు. కేవలం సినిమాల ద్వారానే కాకుండా, రాజకీయంగా కూడా తన ప్రభావాన్ని ఇతర రాష్ట్రాలకు, ముఖ్యంగా పొరుగునే ఉన్న ఏపీకి విస్తరించాలనే ఆలోచనలో విజయ్ ఉన్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు అంటున్నాయి.తమిళనాడు దాటి తన పార్టీని దక్షిణాది ఇతర రాష్ట్రాల్లోకి తీసుకువెళ్లేందుకు అడుగులు వేస్తున్న విజయ్‌కు, ఏపీ తొలి పర్యటన ద్వారా ప్రజా స్పందనను పరిశీలించే అవకాశం ఉంది. విజయవాడ దసరా ఉత్సవాల వేదికగా ఆయన పర్యటిస్తే, ఇక్కడి రాజకీయ, సామాజిక సమీకరణాలపై ఆయనకు ఒక స్పష్టమైన అవగాహన వచ్చే అవకాశం ఉంది. ఇక్కడి స్పందనను బట్టి భవిష్యత్తులో ఏపీ రాజకీయాల్లో టీవీకే ఏ రకమైన పాత్ర పోషించాలనే దానిపై ఆయన ఒక స్పష్టమైన నిర్ణయానికి రావచ్చని భావిస్తున్నారు.తమిళనాట విజయ్ వేస్తున్న ప్రతి అడుగు జాతీయ స్థాయిలోనూ ఆసక్తి రేపుతున్న తరుణంలో, ఆయన ఏపీ టూర్ ఖరారైతే అది తెలుగు రాజకీయాల్లో